## క్లుప్తంగా

### 22న 'భూ భారతి'పై అవగాహన

వాజేడు: తెలంగాణ ప్రభుత్వం కొత్తగా ప్రవేశ పెట్టిన భూ భారతిపై ఈ నెల 22న అవగాహన కార్యాక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు వాజేడు రైతు వేదికలో మధ్యాహ్నం 2 గంటలకు అవగాహన కార్యక్రమం ఉంటుందని రైతులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

### సన్మానం



వాజేడు: స్థానిక సహకార సంఘంలో ఉద్యోగం చేస్తూ పదవీ విరమణ పొందిన వేముల వాడ నాగేశ్వరావును సంఘ పాలక వర్గం, ఉద్యోగులు, గ్రామస్తులు బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వాజేడు, వెంకటాపురం (కె) సొసైటీల అధ్యక్షులు ఎగ్గడి అంజయ్య, చిడెం మోహన్ రావు మాట్లాడుతూ.. నాగేశ్వరావు 41 సంవత్సరాలుగా ప్రతీ ఒక్కరికి ఆదర్శంగా నిలిచేలా ఉద్యోగ బాధ్యతను నిర్వర్తించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు జగన్నాథరాజు, వాజేడు, వెంకటాపురం(కె) డీసీసీబీ మేనేజర్లు నాగేంద్ర, నర్సింహారావు, వెంకటాపురం, ఏటూరునాగార సొసైటీల సెక్రెటరీలు ఆర్‌వీవీ సత్యనారాయణ, గౌరమ్మ, పాలకవర్గ సభ్యులు ఆదినారాయణ, శంఖర్ దయాల్, విక్రాంత్, ఆదినారాయణ, విశ్వనాథ ప్రసాద రాజు, పాపారావు, పుష్పలత తదితరులు ఉన్నారు.

### నిమ్మరసం పంపిణీ



ఏటూరునాగారం: మండల కేంద్రంలో అయ్యప్పస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం సందర్భంగా బుధవారం ఆలయం వద్ద ధర్మజాగరణ ఆధ్వర్యంలో నిమ్మరసం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని ఎఫ్ఆర్ఓ అబ్దుల్‌రెహమాన్ ప్రారంభించారు. కార్యక్రమంలో కార్యకర్తలు పవన్, ఇంద్రసింగ్, రాజు, హరీశ్, ప్రవీణ్, నరేష్ పాల్గొన్నారు.

### చీరల అందజేత



భూపాలపల్లి అర్బన్: మండలంలో గొర్లవీడు గ్రామానికి చెందిన నరాల చిలకమ్మ జ్ఞాపకార్థం ఆమె కూతురు నరాల కవిత, కుమారులు సాగర్, అర్జున్ బుధవారం చీరలు పంపిణీ చేశారు. తల్లిని గుర్తు చేసుకుంటూ గ్రామంలోని వంద మంది పేద మహిళలకు చీరలు అందజేశారు.

### పరామర్శ

కాటారం: మండలంలోని ధన్వాడ మాజీ ఎంపీటీసీ బోడ మమతనరేశ్‌ల కుమారుడు సుహాస్ ఇటీవల మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు బుధవారం పరామర్శించారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు జక్కు రాకేశ్, మండల ఇన్‌చార్జ్ జోడు శ్రీనివాస్, చీమల వంశీ, జక్కు మొగిలి, జక్కు శ్రావన్, పంతకాని సద్వలి, తదితరులు ఉన్నారు.

### వ్యక్తి అదృశ్యం

మొగుళ్లపల్లి: వ్యక్తి అదశ్యమైన సంఘటన మండలంలోని పిడిసిల్లలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పిడిసిల్ల గ్రామానికి చెందిన గైకాడి రవీందర్‌రావు సోమవారం ద్విచక్రవాహనంపై ఒక వ్యక్తితో పని ఉందని వారి బంధువు వద్ద అప్పు ఇప్పిస్తున్నాడని చెప్పి వెళ్లాడు. కాగాఅదే రోజు మొగుళ్లపల్లిలో అతడి అక్క జనక్క ఇంటి వద్ద బైక్ ఉంచి వెళ్లిపోయి ఇప్పటి వరకు తిరిగి రాలేదు. చుట్టూ పక్కల, బంధువుల ఇంటి వద్ద వెతికిన జాడ తెలియక పోడంతో రవీందర్ భార్య శ్రీలత బుధవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అశోక్ తెలిపారు.

### విద్యుదాఘాతంతో పాడిగేదె మృతి



చిట్యాల: మండలంలోని అందుకుతండా గ్రామానికి చెందిన బండమీది రమేశ్ అనే రైతుకు సంబంధించిన పాడిగేదె విద్యుదాఘాతంతో బుధవారం మృతి చెందింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. రోజువారిలాగే మేత కోసం ఇంటి నుంచి వెళ్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ స్తంభానికి ఉన్న వైర్‌కు తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. గేదె విలువ సుమారు రూ.48 వేలు ఉంటుందని ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు వేడుకున్నాడు.

# అలంకారప్రాయంగా 'గుండ్ల వాగు'



నీరులేక వెలవెల బోతున్న ప్రాజెక్టు



ప్రాజెక్టు లోపలి భాగంలో కూలుతున్న గోడ

- శిథిలావస్థకు చేరి కూలుతున్న గోడలు
- నీరు లేక వెలవెలబోతున్న ప్రాజెక్టు

వాజేడు: గుండ్ల వాగు ప్రాజెక్టు మనుగడపై నీలి నీడలు కమ్ముకుంటున్నాయి. నాసిరకం నిర్మాణం కారణంగా నేడు ప్రాజెక్టు మనుగడ శాపంగా మారింది. ప్రాజెక్టు కింద ఉన్న ఆయకట్టు రైతులకు ఒక్క ఎకరానికి కూడా సాగు నీరు అందని పరిస్థితి. ప్రాజెక్టు ద్వారా తమ పంటలకు సాగు నీరు అందుతుందని ఆశించి రైతులకు ఆశగానే మిగిలింది. ప్రాజెక్టులో చుక్క నీరు కూడా ఉండ కుండా బయటకు వెళ్తుండడంతో అలంకార ప్రాయంగా మారింది.

**ఆది నుంచి అడ్డంకులే..**

1970 సంవత్సరంలో జలగం వెంగళరావు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రాంతంలో ఈ ప్రాజెక్టును మంజూరు చేసి ప్రారంభించారు. రూ.3 కోట్లతో ప్రాజెక్టు నిర్మాణ పనులను మొదలు పెట్టారు. నిధులు సరిపోకపోవడంతో మరికొన్ని మంజూరు చేసి ప్రాజెక్టును పూర్తి చేశారు. కాని ప్రాజెక్టులో ఉండాల్సిన నీరంతా భూగర్భం నుంచి బయట వాగులోకి వచ్చి చేరేవి. ఎక్కడి నుంచి నీరు బయటకు వెళ్తుందో అర్థంకాక అలానే వదిలేశారు. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా చేసిన సమయంలో ప్రాజెక్టు విషయం తెలియడంతో జపాన్‌కు చెందిన సాంకేతిక నిపుణులతో అధ్యయనం చేసి ప్రాజెక్టు పునర్నిర్మాణానికి రూ.14 కోట్ల నిధులను మంజూరు చేసి భూగర్భంలో ఉన్న రంధ్రాలను పూడ్చారు. కాల్వ సక్రమంగా లేక పోవడంతో సాగు నీరు అందించలేదు. దివంగత ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి హయాంలో ప్రధాన కాల్వ నిర్మాణాన్ని రూ.8 లక్షలతో పూర్తి చేయించారు. వర్షాకాలం సమయంలో కాల్వలకు గండ్లు పడుతుండటంతో రైతులకు ఇబ్బందిగా మారింది. ఈ ప్రాజెక్టు ద్వారా 2580 ఎకరాల విస్తీర్ణానికి సాగు నీరు అందించాల్సి ఉన్నా నేటి వరకు ఒక ఎకరానికి కుడా సాగు నీటిని అందించ లేదు.



నిరుపయోగంగా మారిన ప్రధాన కాల్వ

**ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యమే..**

ప్రాజెక్టు నిర్మాణం, కాల్వ నిర్మాణ సమయంలో ఇరిగేషన్ అధికారులు సక్రమంగా పర్యవేక్షణ చేయకపోవడం కారణంగానే ప్రాజెక్టు నిరుపయోగంగా మారిందని రైతులు ఆరోపిస్తున్నారు. ప్రతీ సంవత్సరం ప్రాజెక్టు ప్రధాన కాల్వ తెగి పోవడం, దానిని తూతూ మంత్రంగా మరమ్మతులు చేయడం పరిపాటిగా మారిందని వాపోతున్నారు. నేడు ప్రాజెక్టు నుంచి నీరు వెలుపలికి వస్తుండటం ప్రాజెక్టు మనుగడకే ముప్పని రైతులు తెలుపుతున్నారు. ప్రాజెక్టు నిర్మాణ సమయంలో ఇరిగేషన్ శాఖ అధికారులు దగ్గర ఉండి పర్యవేక్షణ చేసి ఉంటే నేడు ప్రాజెక్టు ద్వారా తమ పంటలకు సాగు నీరు అందేదని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

**కూలుతున్న గోడలు**

ప్రాజెక్టు ప్రధాన కట్ట వద్ద గోడలు కూలి పోతున్నాయి. 1970 సంవత్సరంలో నిర్మించిన ప్రాజెక్టు కావడంతో గోడ ప్రధాన గేటు సమీపంలో కొంత భాగం కూలిపోయింది. ప్రాజెక్టును త్వరితగతిన మరమ్మతులు చేయకపోతే వర్షాకాలంలో ఇంకా గొడ కూలిపోయే ప్రమాదం పొంచి ఉంది. అదే జరిగితే ప్రాజెక్టు మనుగడే ప్రశ్నార్థకంగా మారుతుంది. అధికారులు ఇప్పడికైనా ముందుగా మేల్కొని ప్రాజెక్టుకు ఏమి జరుగక ముందే మరమ్మతులు చేయించి తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. ప్రాజెక్టులో నిల్వ ఉండాల్సిన నీరు జాడ లేదు. ప్రాజెక్టు గర్భంలో చుక్క నీరు లేకుండా వెలవెలబోతుంది. ప్రాజెక్టు నిర్మాణం నాటి నుంచి ఇంత వరకు ఈ ప్రాజెక్టు ద్వారా ఒక ఎకరానికి కూడా నీటిని అందించిన దాఖలాలు లేవు.

## బాధిత కుటుంబానికి అండగా ఉంటా..

- రాష్ట్ర అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ వీరయ్య

మంగపేట: మండలంలోని మల్లూరు పంచాయతీ పరిధిలోని మొట్లగూడెంలో ఇటీవల ఆత్మహత్యకు పాల్పడిన రైతు యాలం నర్సింహారావు కుటుంబానికి అండగా ఉంటానని భద్రాచలం మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పొదెం వీరయ్య అన్నారు. మండలంలోని మొట్లగూడెంలో వడగళ్ల వర్షంతో 15 ఎకరాల్లో వరి పంట పూర్తిగా నష్టపోయి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి వైద్యం పొందుతూ మృతి చెందిన రైతు నర్సింహారావు కుటుంబ సభ్యులను పొదెం వీరయ్య బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుడి భార్య లక్ష్మి, కుమారుడు కల్యాణ్‌ను ఆయన పరామర్శించి రూ 10,000 ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట బీఆర్ఎస్ జిల్లా సీనియర్ నాయకుడు తాటి కృష్ణ, కొమురం రామ్మూర్తి, సమ్మయ్య, నర్సింహులు, పూజారి శ్రీనివాస్, అమిలి చంద్రం తదితరులు పాల్గొన్నారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న పొదెం వీరయ్య

## నిత్యావసర సరుకుల పంపిణీ

ఎస్ఎస్‌తాడ్వాయి: రాష్ట్ర గవర్నర్ దత్తత తీసుకున్న మండలంలోని కొంపడర్తి ఆదివాసీలకు ఎన్సీ ఆర్డీ స్వచ్ఛంధ సంస్థ చైర్మన్ డాక్టర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో బుధవారం గ్రామంలో సరుకులను పంపిణీ చేశారు. నిత్యావసర సరుకులతో పాటు మహిళలకు చీరెలు, పురుషులకు దుస్తులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గవర్నర్ దత్తత గ్రామాలోని పేదలకు నేల రోజుల పాటు సరిపడ సరుకులు పంపిణీ చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బొల్లు దేవేందర్, మేడారం ట్రస్ట్ బోర్డు చైర్మన్ అరెం లచ్చు పటేల్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ పాక సాంబయ్య, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు రేగ కల్యాణి, బ్లాక్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు ఎండీ ముజఫర్, మాజీ సర్పంచ్ ఇర్ప సునీల్ దొర, జిల్లా నాయకులు తండాల శ్రీను, సింగిల్ విండో డైరెక్టర్ యానాల సిద్దిరెడ్డి, తాడ్వాయి గ్రామ కమిటీ అధ్యక్షులు పాక రాజేందర్, నాయకులు కల్తి రమేశ్, సీతారాములుతో పాటు తదితరులు పాల్గొన్నారు.



సరుకులను పంపిణీ చేస్తున్న శ్రీనివాస్

## అక్రమంగా తరలిస్తున్న పశువుల పట్టివేత



నిందితుల అరెస్ట్ చూపుతున్న ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి

ఎస్ఎస్ తాడ్వాయి: ఏటూరునాగారం నుంచి హనుమకొండ వైపు బొలేరో వాహనాల్లో పశువులను అక్రమంగా తరలిస్తుండగా పట్టుకోని 10 మందిని తాడ్వాయి పోలీసులు మంగళవారం రాత్రి అరెస్టు చేశారు. ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం ఏటూరునాగారం ప్రాంతం నుంచి ఐదు బొలేరో వాహనాల్లో తరలిస్తున్న పశువులను పట్టుకున్నట్లు తెలిపారు. వాహనాలను స్వాధీనం చేసుకొని డ్రైవర్లు అల్లి విజేందర్, అమోగోతు విజేందర్, గుగులోతు చంద్రు, భూక్యా అరుణ్, ముద్దెర బోయిన అశోక్, బానోతు రజిత,ధరమ్‌గోత్ శ్రీను, గుగులోతు గోత్య, క్రాంతి, రమేష్ లను అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. పశువులను భూపాలపల్లి జిల్లా రాంపూర్ గోశాలకు తరలించినట్లు తెలిపారు. ఎవరైనా అక్రమంగా పశువులను తరలిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.



వాహనంలో అక్రమంగా తరలిస్తున్న పశువులు

## జ్యూట్ బ్యాగుల తయారీతో ఉపాధి

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారావు

ఏటూరునాగారం: జ్యూట్ బ్యాగుల తయారీతో ఉపాధి అవకాశం కలుగుతుందని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహారావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని షిర్డిసాయిబాబా ఆలయంలో జ్యూట్ బ్యాగుల ఉచిత శిక్షణ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. మహిళలు ఇంటికే పరిమితం కాకుండా మార్కెట్‌లో అందుబాటులో ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో కాకులమర్రి ప్రదీప్‌బాబు, తాడూరి రఘు, సునీల్, బోజారావు, తదితరులు పాల్గొన్నారు.



లక్ష్మీనర్సింహారావుకు జ్యూట్ బ్యాగులను అందజేస్తున్న మహిళలు

## బొడ్రాయి ప్రతిష్ఠాపన



పూజలో పాల్గొన్న ప్రభాకర్‌రెడ్డి

మల్హర్: మండలంలోని కాపురం గ్రామంలో నాలుగు రోజులుగా బొడ్రాయి ప్రతిష్ఠాపన ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. బుధవారం వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య బొడ్రాయిని ప్రతిష్ఠించారు. తాడిచర్ల ఏఎమ్మార్ ప్రాజెక్టు కంపెనీ వైస్ ప్రెసిడెంట్ ప్రభాకర్ రెడ్డి, తాడిచర్ల మైన్ సీనియర్ జనరల్ మేనేజర్ కేఎస్ఎన్ మూర్తి ఈ వేడుకల్లో పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అగ్నిప్రతిష్ఠాపన, చండీహోమం, బొడ్రాయి ఊరేగింపు, అభిషేకం తదితర కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. అనంతరం మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అంతకుముందు గ్రామ పొలిమేరల లో కట్టు పోశారు.

## కార్మికుల హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వం

- ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రవీందర్

ములుగు రూరల్: కార్మికుల సంక్షేమం కోసం పోరాడి సాధించుకున్న హక్కులను కేంద్ర ప్రభుత్వం కాలరాసే ప్రయత్నం చేస్తుందని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ఎత్తి వేసే కుట్రను ప్రభుత్వం విరమించుకోవాలని అన్నారు. కార్మికుల హక్కుల ప్రకారం మృతి చెందిన కార్మికుడి కుటుంబానికి రూ.10 లక్షలు చెల్లించాలని అన్నారు. వివాహాలకు, ప్రసూతిలకు, అంగవైకల్యానికి నిధులు కేటాయించి కార్మికులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు బండి నర్సయ్య, దేవేందర్, రాజు, ఐలయ్య, శ్యాంసుందర్, కొమురయ్య, రామయ్య, లక్ష్మీ, పద్మ, స్వరూప తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న రవీందర్

## రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర

గోవిందరావుపేట: మండలంలోని ప్రాజెక్ట్ నగర్, ముత్తాపూర్, రాఘవపట్నం, రంగాపూర్ గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రసుపుత్ సీతారాం నాయక్ ఆధ్వర్యంలో జై బాపు, జై భీమ్, జై సంవిదాన్‌లో భాగంగా బుధవారం రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర నిర్వహించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బైరెడ్డి భగవాన్ రెడ్డి, జిల్లా మహిళ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు రేగ కల్యాణి హాజరై మాట్లాడారు. కుల, మత, లింగ, ప్రాంత, ధనిక, పేద తారతమ్యాలు లేకుండా అతి పెద్ద రాజ్యాంగాన్ని నిర్మించేలా అంబేడ్కర్‌కి కాంగ్రెస్ పార్టీ చొరవ చూపిందని అన్నారు. ఈ కార్యక్రమంలో జెట్టి సోమయ్య, గనపాక సుదాకర్, కొంపెల్లి శ్రీనివాస్ రెడ్డి, రసపుత్ సీతారాం నాయక్, హరిప్రసాద్ పాల్గొన్నారు.

మల్హర్: మండలంలోని తాడిచర్లలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బడితెల రాజయ్య ఆధ్వర్యంలో బుధవారం నాయకులు రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహాత్మా గాంధీ, బాబాసాహెబ్ అంబేడ్కర్, రాజ్యాంగాన్ని బీజేపీ నాయకులు అవహేళనగా మాట్లాడుతూ పైశాచిక ఆనందం పొందుతున్నారని ఆరోపించారు. మతతత్వ బీజేపీని దేశం నుంచి తరిమికొట్టేందుకు ప్రజలంత సిద్ధం కావాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు దండు రమేశ్, పీఏసీఎస్ చైర్మన్ ఇప్ప మొండయ్య, వైస్ చైర్మన్ మల్క సూర్య ప్రకాశ్, మాజీ ఎంపీపీ చింతలపల్లి మల్హల్‌రావు, పార్టీ జిల్లా అధ్యక్షుడు అయిత రాజిరెడ్డి, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు గడ్డం, తాడిచర్ల గ్రామశాఖ అధ్యక్షుడు కేశారపు చంద్రయ్య, రాజసమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.



గోవిందరావుపేట: పాదయాత్ర నిర్వహిస్తున్న నాయకులు

## నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

నర్సంపేట : అకాల వర్షానికి నష్టపోయిన వరి, మొక్కజొన్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు (సీపీఎం) జిల్లా కమిటీ సభ్యుడు పరికి మధుకర్ డిమాండ్ చేశారు. చెన్నారావుపేట మండలంలోని ఉప్పరపల్లిలో అకాల వర్షానికి నేలమట్టమైన వరి, తడిసిన మొక్కజొన్నలను వారు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆరుగాలం కష్టపడి పంటలు చేతికొచ్చే సమయంలో అకాల వర్షం రైతులకు కన్నీరే మిగులుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల కష్టాలు, సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లే వ్యవసాయ అధికారులు కుర్చీలకే పరిమితమై చోద్యం చూస్తున్నారని మండిపడ్డారు. నిర్లక్ష్యంగా ఉన్న అధికారులను తక్షణమే సస్పెండ్ చేయాలని కోరారు. మొక్కజొన్నలకు రూ.3వేల గిట్టుబాటు ధర ప్రకటించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలని అన్నారు. పంట నష్టాన్ని తక్షణమే అంచనావేసి రైతులకు నష్ట పరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు పెరుమాండ్ల అమరేందర్‌రెడ్డి, కుక్కల రాజు, రైతులు మహ్మద్ బాషమీయ, లంకలపల్లి రాజాలు, రాములు ఉన్నారు.



మొక్కజొన్నలను పరిశీలిస్తున్న నాయకులు

# పౌష్టికాహారం తీసుకోవాలి



వాజేడు: మాట్లాడుతున్న సీడీపీఓ ముత్తమ్మ



పలిమెల: అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ టీచర్ శివమ్మ

- సీడీపీఓ ముత్తమ్మ

వాజేడు: గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా పోషక విలువలు ఉన్న ఆహారాన్ని తీసుకోవాలని వెంకటాపురం(కె) సీడీపీఓ ముత్తమ్మ అన్నారు. వాజేడు మండలం మొరుమూరులో ఉన్న మూడు అంగన్ వాడీ కేంద్రాల పరిధిలోని గర్భిణులు, బాలింతలకు బుధవారం పోషక ఆహారంపై అవగాహన కల్పించారు. పప్పులు, బెల్లం, పాలు, ఆకుకూరలు, గుడ్లు, ఐరన్‌కు సంబంధించిన ఆహారం తీసుకోవాలని సూచించారు. అంజమ్మ, విజయేందర్, చంద్రకళ, రమాదేవి తదితరులు ఉన్నారు.

కాటారం: గర్భిణులు, బాలింతలు పోషకాలతో కూడిన ఆహారం తీసుకుంటే తల్లి బిడ్డ సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శివరాణి అన్నారు. కాటారం మండలం ఇబ్రహీంపల్లి జీపీ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం పోషణ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. పోషకాహారం, రక్తహీనత, గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, హ్యాండ్‌వాష్‌పై అవగాహన కల్పించారు. పోషక ఆహారపదార్థాలు తయారు చేసి ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు లక్ష్మి, సుమతి, గర్భిణీలు, బాలింతలు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

పలిమెల: రోజువారి ఆహారంలో చిరుధాన్యాలు, పౌష్టికాహారం ఉండేలా చూసుకుంటే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని అంగన్‌వాడీ టీచర్ శివమ్మ అన్నారు. పోషణ పక్వాడలో భాగంగా బుధవారం మండలంలో బూరుగుగూడెం అంగన్‌వాడీ కేంద్రంలో బాలింతలు, గర్భిణులు, మహిళలకు చిరుధాన్యాలు, పౌష్టికాహారంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మల్లికార్జున్, ఏఎన్ఎం పుష్ప, ఆశవర్కర్లు శ్రీలత, లక్ష్మి, అంగన్‌వాడీ సిబ్బంది, తల్లులు పాల్గొన్నారు.



టేకుమట్ల: గుమ్మడవెల్లి అంగన్‌వాడీలో..



కాటారం: మాట్లాడుతున్న సూపర్‌వైజర్ శివరాణి

టేకుమట్ల: మండలంలోని గుమ్మడవెల్లి అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్‌వాడీ టీచర్ రమాదేవి ఆధ్వర్యంలో బుధవారం పోషణ పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లల పుట్టిన రోజు వేడుకలతో పాటు, అన్నప్రాసన, అక్షరాభ్యాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆసిఫ్ జలీల్, ఆశ కార్యకర్త పద్మ, సీఏ భాగ్యశ్రీ, అంగన్‌వాడీ ఆయా శ్రీదేవి, తల్లులు పాల్గొన్నారు.

## 'కాకా కుటుంబాన్ని విమర్శిస్తే ఊరుకోం..'

కాటారం: దివంగత మాజీ కేంద్ర మంత్రి గడ్డం వెంకటస్వామి(కాకా) కుటుంబాన్ని విమర్శిస్తే ఊరుకునేది లేదని మండల మాలమహానాడు నాయకులు పంతకాని సదువలి, మెంద మల్లికార్జునరావు, పంతకాని లస్మయ్య అన్నారు. మండల కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు కాకా కుటుంబంపై చేసిన వ్యాఖ్యలను వారు తీవ్రంగా ఖండించారు. 70 ఏళ్లుగా కాకా కుటుంబానికి కాంగ్రెస్ పార్టీతో సంబంధం ఉందని ప్రేమ్‌సాగర్‌రావుకు గతంలో ఎమ్మెల్సీ పదవి ఇప్పించింది కాకా అని మరిచిపోయి మాట్లాడుతున్నాడని అన్నారు. పంతకాని చిన్నసద్వలి, బోడ బాపు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు